క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కారేపల్లి: మండల పరిధిలోని గాంధీనగర్, విశ్వనాథపల్లి గ్రామాల్లో ఉన్న పోలింగ్ బూత్‌లను పీఆర్ డీఈ, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ చంద్రమౌళి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, టాయిలెట్, తాగునీరు, బూత్‌లలో లైటింగ్ వచ్చేలా ఏర్పాటు చేయాలన్నారు. ఆయన వెంట గ్రామ కార్యదర్శులు సీమశ్రీ, రవి ఉన్నారు.

ముదిగొండ: మండలంలోని వనంవారికిష్టాపురం, వల్లాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లోని వసతులను పరిశీలించారు. బాణాపురంలోని పోలింగ్ కేంద్రం గోడలపై రాస్తున్న ఓటు ప్రాముఖ్యత నినాదాలను, వననర్సరీని పరిశీలించారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం

ఎర్రుపాలెం: మండలంలోని రామన్నపాలెం గ్రామంలోని ప్రగతి ఉన్నత పాఠశాలలో శనివారం యూకేజీ నుంచి ఐదో తరగతి కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు కోర్సు సర్టిఫికెట్స్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, కరస్పాండెంట్ బి.అంజన్‌బాబులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుల్లో మరింతగా రాణిస్తూ భవిష్యత్‌లో ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రారంభమైన బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కారేపల్లి: మండలంలోని పాతకమలాపురం, భాగ్యనగర్‌తండా గ్రామాల్లో బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాల్లో భాగంగా శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు ప్రారంభమైయ్యాయి. గ్రామ ప్రజలు యాగశాలలను నిర్మించి వేదపండితుల మంత్రోచ్ఛరణల నడుమ.. మేళతాళాలతో పూజలు నిర్వహించారు. ఈ నెల 22న నాభిశిల ప్రాణప్రతిష్ఠ, అనంతరం మహాఅన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

వైభవంగా అంకమ్మతల్లి తిరునాళ్లు



జలబిందెలు మోస్తున్న చిన్నారులు

సత్తుపల్లిరూరల్: మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలోని శ్రీఅంకమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవాల సందర్భంగా శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం మేళతాళాలు.. డబ్బు వాయిద్యాల నడుమ మహిళలు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ జలబిందెలు కార్యక్రమం నిర్వహించారు. రాత్రి పూల కప్పెర కార్యక్రమం చేశారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

ముదిగొండ: మండలపరిధిలోని ముత్తారం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో చక్రతీర్థం, వసంతసేవ, స్వామివారి అమ్మవారి సన్నిధిన కొబ్బాలు దంచుట, స్నపన తిరుమంజన సేవా కార్యక్రమాలు శనివారం నిర్వహించారు. సాయంత్రం వేళ కోదండరామాపురంలో గ్రామంలో స్వామి వారి తిరువీధి సేవ గరుడోత్సవం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే కారు తనిఖీ

కల్లూరు: సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కారును శనివారం సత్తుపల్లిలో ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేశారు. కల్లూరు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న ఆయన కారును ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి వి.ప్రభాకర్ తనిఖీ చేశాక ముందుకు వెళ్లారు.

బీజేపీ గెలవడం ఖాయం

పెనుబల్లి: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు బొర్రా నరసింహారావు అన్నారు. ఈ సదర్భంగా శనివారం మండల పరిధిలోని మండాలపాడు, గొల్లగూడెం బూత్‌లలో నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు బొర్రా నసింహారావు, జిల్లా కార్యదర్శి మున్నా మిశ్రా, అధికార ప్రతినిధి పడిగల మధుసూధన్‌రావు, మండల ప్రధాన కార్యదర్శి ఓరుగంటి రాము, ఎస్సీ మోర్చా పేర్ల మహేష్ ఎస్టీ మోర్చా బానోత్ రమేష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి అండ మట్టికుండ



వేసవిలో చల్లని నీరు తాగేందుకు ప్రతి ఒక్కరూ ఆరాటపడతారు. కాస్త స్థితిమంతులు రిఫ్రిజిరేటర్‌లో నీటిని తాగితే మధ్య తరగతి ప్రజలు కుండలోని నీటిని తాగుతారు. రిఫ్రిజిరేటర్లు అందుబాటులో ఉన్నా కుండలకు సాటిరావని కొనుగోలు దారుల అభిప్రాయం. అందుకే వైరా ప్రధాన రహదారుల వెంట విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.

- వేసవిలో నీటి కుండలకు ఆదరణ
- గతంలో కంటే పెరిగిన ధరలు
- ప్రజలకు అందుబాటులో విభిన్న రకాలు
- ఆసక్తి చూపుతున్న కొనుగోలుదారులు



మట్టితో తయారు చేసిన బాటిల్, జగ్గు, పెళ్లిలో వినియోగించే అరవిందు, పెరుగు తోడు వేసుకునే పాత్ర

వైరారూరల్: ప్రస్తుతం మారుతున్న యుగంలో పట్టణ, పల్లె ప్రజలు పురాతనపు ప్రాముఖ్యత కలిగిన నీటి కుండల వైపు మొగ్గు చూపుతున్నారు. వేసవిలో ఫ్రిజ్‌ల ధరలు భారీగా పెరిగిన నేపథ్యాన మధ్యతరగతి కుటుంబాలతో పాటు కుండల్లో నీటిని తాగితే కలిగే ప్రయోజనాలు తెలిసిన ప్రతి ఒక్కరూ నీటి కుండల కొనుగోలుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. దాంతో ప్రజా అవసరాలకు అనుగుణంగా తయారీ దారులు వాటర్ బాటిల్స్, జగ్గుల తరహాలో తయారు చేసిన మట్టి పాత్రలు మార్కెట్లో విడుదల చేయడంతో ప్రజల్లో ఆదరణ పెరిగింది.

ప్రజలకు అందుబాటులో విభిన్న రకాలు..

ప్రజల అవసరాలకు అనుగుణంగా మార్కెట్లో కేవలం ఒక్క నీటి కుండలే కాకుండా విభిన్న రకాల మట్టి పాత్రలు మార్కెట్లో అందుబాటులోకి వస్తున్నాయి. అందులో ప్రధానంగా మట్టితో మిషన్లలో తయారు చేసే వాటర్ బాటిళ్లు, జగ్గు తరహా పాత్రలతో పాటుగా చిన్న చిన్న మట్టి పాత్రలు కూడా అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఉద్యోగులు, వ్యాపారస్తులు, వాహనదారులు వీటిపై ఎక్కువ మక్కువ చూపిస్తున్నారు.

పెరిగిన ధరలు..

గతంతో పోల్చుకుంటే ఈ ఏసారి మట్టి కుండల ధరలు అమాంతంగా పెరిగాయి. స్థానికంగా కుండల తయారీపై కులవృత్తిదారులు సుముఖంగా లేక పోవడం వ్యాపారులు కుండల కొనుగోలుకు దూర ప్రాంతాలకు వెళ్లి అక్కడ నీటి కుండలను కొనుగోలు చేసుకొని ప్రజలకు విక్రయిస్తున్నారు. గతంలో సైజును బట్టి ఒక్కో నీటికుండ ధర రూ.100 నుంచి రూ.130 లు ఉండగా.. ప్రస్తుతం రూ.180 నుంచి 300 వరకు ఉన్నాయి. వీటితో పాటుగా మట్టి వాటర్ బాటిళ్లు, జగ్గు తరహాలో పాత్రలు రూ.150 నుంచి రూ.200 వరకు ఉన్నాయి. కొన్ని చోట్ల హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తున్నారు. ఏదేమైన ఈ ఏడాది ధరలు భారీగా పెరిగాయి.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..

స్థానికంగా మట్టి కుండల తయారీ లేనందున వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి మట్టి కుండలను దిగుమతి చేసుకోని ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. పురాతనపు పద్ధతులను పాటించి కుండల తయారు చేసే నిర్వాహకుల దగ్గర ఒక్క కుండకు కొంత మేర ధరను వెచ్చించి కొనుగోలు చేసుకోని రావడం కుండ మీద రూ.30 నుంచి రూ.50 లాభం చూసుకోని విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..



స్థానికంగా నీటి కుండల తయారీ లేనందున ఖమ్మం ప్రకాష్‌నగర్, నూజీవీడు ప్రాంతాల నుంచి కుండలను కొనుగోలు చేసుకోని ఇక్కడ వ్యాపారం చేస్తున్నాం. ప్రస్తుత వేసవిలో ప్రజలు ఆరోగ్యవంతమైన తాగునీటి కోసం నీటి కుండలను కొనుగోలు చేస్తున్నారు. రోజులకు సుమారు 10 కుండల వరకు అమ్ముడుపోతున్నాయి. ప్రజలకు అవసరాలకు అనుగుణంగా హోల్‌సెల్ ధరలకు కుండలను అమ్ముతున్నాము.

– బండారు భూదేవి, కుండల వ్యాపారి

డిమాండ్ పెరిగింది..



గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం మట్టి కుండల ధరలు అమాంతం పెరిగాయి. గతంలో రూ.130 చెల్లిస్తే నీటి కుండ వచ్చేది. కానీ ప్రస్తుతం కుండ సైజును బట్టి ఒక్కో నీటి కుండ రూ.150 నుంచి రూ.300 వరకు ధర పలుకుతుంది. సామాన్య ప్రజల్లో నీటి కుండలకు ఆదరణ ఉండడం వలన ధర ఎంతైనా సరే లెక్క చేయకుండా పేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు మట్టి కుండల కొనుగోలుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

– బాణాల నర్సింహాచారి, లింగన్నపాలెం

అందుబాటులో విభిన్న రకాలు..



కుండల తయారీ నిర్వాహకులు ప్రజా అవసరాలకు అనుగుణంగా మార్కెట్లోకి విభిన్న రకాల కుండలు, మట్టి పాత్రలు అందుబాటులో ఉంచుతున్నారు. దూరప్రాంతాలకు వెళ్లే ప్రజలు చల్లటి నీటి కోసం వాటర్‌బాటిల్ తరహాలో ఉండే పాత్రలను విక్రయిస్తున్నారు. దీనిలో సుమార్ రెండులీటర్ల వరకు మంచినీటిని తీసుకెళ్లొచ్చు. దీంతో ఎంత దూరమైన ప్రయణించి చల్లటి నీటిని తాగేందుకు వీలుగా ఉంటుంది.

– సాగినేని నాగేశ్వరరావు, కేజీ సిరిపురం

ముగిసిన ఫైర్ వారోత్సవాలు



వారోత్సవాల్లో పాల్గొన్న ఫైర్ ఉద్యోగులు

మధిర: మున్సిపాలిటీ పరిధిలోని ఎంప్లాయిస్ కాలనీ ఫైర్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించినట్లు ఇన్‌చార్జ్ ఫైర్ ఆఫీసర్ బండారు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ రద్దీకూడళ్లలో ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఫైర్ సిబ్బంది అగ్ని ప్రమాదాల సమయంలోనే కాకుండా ప్రకృతి విపత్తుల సమయంలో, రోడ్ ప్రమాదాల, జల ప్రమాదాల సమయంలో కూడా సేవలు వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఫైర్ వారోత్సవాలను పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మధిర డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది ఫైర్ సిబ్బంది సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది బి.నాగేశ్వరరావు, బి.అనంతరామిరెడ్డి, బి.భాస్కర్, ఎం.సతీష్, టి.మోహన్, కె.చెన్నారావు జి.శ్రీను, కష్ణ ప్రసాద్, రాంప్రసాద్, సర్వేశ్వరరావుల తో పాటు ఎంప్లాయిస్ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు పంపిణీ



కుట్టు మిషన్లు అందజేస్తున్న సభ్యులు

ఏన్కూరు: మండలంలోని రాయమాదారంలో చేతన ఫౌండేషన్, మన్నెపల్లి అనంత రామయ్య, అనసూర్యమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో పదిమంది పేద మహిళలకు శనివారం కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు మోతుక్కూరి నారాయణరావు, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్‌కు వితరణ



దయానంద్‌ను సన్మానిస్తున్న యాజమాన్యం

సత్తుపల్లిరూరల్: స్థానిక విశ్వశాంతి విద్యాలయంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆ పాఠశాల పూర్వ విద్యార్థులు యార్లగడ్డ భవాని, జయరాం దాచుకున్న రూ.10వేలను విరాళంగా అందజేశారు. ఈ నగదును ఆ విద్యార్థుల తండ్రి దయానంద్(నందు) పాఠశాల యాజమాన్యానికి అందించారు. దీంతో ఆయనను పాఠశాల యాజమాన్యం శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

కూలీలకు వేతనాలు చెల్లించాలి



ఏన్కూరు: ఉపాధి కూలీలతో కృష్ణ



వైరారూరల్: మాట్లాడుతున్న అర్జున్‌రావు

ఏన్కూరు/వైరారూరల్: మండుటెండల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలకు తక్షణమే వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా కార్యదర్శి మంకెన కృష్ణ, ఏఐకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల అర్జున్‌రావు తెలిపారు. శనివారం ఏన్కూరు మండలంలోని గార్లఒడ్డులో కృష్ణ, వైరాలోని పాలడుగు గ్రామంలో అర్జున్‌రావులు ఉపాధి కూలీలను కలిసి మాట్లాడారు. ఉపాధిహామీ చట్టాన్ని అమలుచేసి కూలీలకు 200 పనిదినాలతో పాటు రూ.600 వేతనం చెల్లించాలన్నారు. కొత్త కూలీలకు పనులు కల్పించాలని, పార్లమెంట్ ఎన్నికల పేరుతో కూలీలకు ఇబ్బందులు జరగకుండా చూడాలని, ప్రతీవారం వేతనాల చెల్లింపులు చేయాలన్నారు. కూలీల సౌకర్యార్థం పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, మంచి నీటి సదుపాయం, టెంట్లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైరా డివిజన్ కమిటీ అధ్యక్షుడు షేక్.జాని, గుత్తా హనుమంతరావు, మోదుగు గోవిందు, షేక్.మోలానా, వీరయ్య, ఏఐటీయూసీ నాయకులు రేగుముడి సంజన, మంకెన సునీత పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న దండు ఆదినారాయణ

సత్తుపల్లిరూరల్: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దండు ఆదినారాయణ అన్నారు. శనివారం సత్తుపల్లి మండలం కిష్టారంలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను ఆయన కలిసి మాట్లాడారు. రైతులు, కూలీలు, కార్మికులు, మహిళల హక్కులు కాలరాస్తున్న మోదీని గద్దెదించాలన్నారు. గెలిస్తే ధరలు తగ్గిస్తా, కుటుంబానికి రూ.15 లక్షలు, నిరుద్యోగులకు 2లక్షల ఉద్యోగాలు అని చెప్పిన మోదీ గెలిచాక ధరలు పెంచడమే కాకుండా నిరుద్యోగులకు మొండిచేయి చూపారన్నారు. దేశంలో బీజేపిని, బీజేపికి సపోర్ట్ చేస్తున్న మతతత్వ శక్తులను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య సత్తుపల్లి డివిజన్ నాయకులు సీపీఐ కార్యదర్శి ఎస్‌కె లాల్ మహమ్మద్, ఎస్‌కె రంజాన్‌బీ, యువజన సమైఖ్య ఏఐవైఎఫ్ నాయకులు ఎస్‌కె హమీద్, తిన్నపోయిన రామారావు, పుల్లారావు, రాధ, ఆదెమ్మ, గురుప్రసాద్, వెంకటేశ్వరరావు, ప్రసాద్, సత్యనారాయణ, సత్యవాణి, రఫీ, దావన్, సుబ్బమ్మ, వెంకటలక్ష్మి, లాల్‌బీ, రాంప్రసాద్, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కృష్ణ, మహేష్, రామారావు పాల్గొన్నారు.

రాజీనామా

ఏన్కూరు: మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు బానోత్ సురేష్ నాయక్ ఆ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. ఈ లేఖను జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాత మధుసూదన్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన వ్యక్తిగత కారణాల దృష్ట్యా పార్టీని విడుతున్నట్లు తెలిపారు.

న్యాయవాదులు అధ్యయనం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

సత్తుపల్లి: నూతనంగా న్యాయవాద వృత్తిలోకి వచ్చిన జూనియర్ న్యాయవాదులు నిరంతరం న్యాయశాస్త్రాలను అధ్యయనం చేయాలని సత్తుపల్లి సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి అన్నారు. సత్తుపల్లి కళాభారతిలో శనివారం ఐఏఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్.ఇమావలి అధ్యక్షతన.. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) జిల్లా యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టడీ సర్కిల్‌కు ఆమె పాల్గొని మాట్లాడారు. గౌరవ ప్రదమైన వృత్తిని ఎంచుకోవడం సంతోషించదగ్గ విషయమన్నారు. ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడటానికి న్యాయవాద వృత్తి ఎంతో తోడ్పడుతుందన్నారు. తెలంగాణ బార్ అసోసియేషన్ సభ్యుడు దుస్సా జనార్ధన్ మాట్లాడుతూ.. నూతనంగా వచ్చిన చట్టాలను అధ్యయనం చేయాల్సిన అవసరం జూనియర్ న్యాయవాదుల మీద ఉందన్నారు. వాస్తవానికి 152 సంవత్సరాల క్రితం రాసిన ఐపీసీని మార్చటంలో తప్పేమీ లేదని కానీ అందులో బీజేపీ తన విధానాన్ని ప్రవేశపెట్టడమే ఇబ్బందికరమైన అంశమన్నారు. అనతరం ఖమ్మంజిల్లా చీఫ్ లీగల్ ఎయిడ్ మామిడి హనుమంతురావు మాట్లాడుతూ.. ఐపీసీలో బ్రిటీష్ కాలం నాటి 22 సెక్షన్లను తొలగించారన్నారు. సీఆర్పీసీలో 17 సెక్షన్లను తొలగించడంతో పాటు ఆరు సెక్షన్లను కలిపారని ఆయన వివరించారు. వాస్తవానికి సత్వర న్యాయం పేరుతో తీసుకొచ్చిన ఈ చట్టాలు.. కోర్టుల సంఖ్య, జడ్జిలు ఇతర యంత్రాంగం లేని సమస్యతో మళ్లీ కథ మొదటికే వస్తుందన్నారు. ముఖ్యంగా 124 ఏ ను పొందుపరిచి బీజేపీ తన మార్కును చూపించుకుందన్నారు. రాజద్రోహం పేరు తొలగించి దేశద్రోహంగా మార్చిందన్నారు. ఈ సెక్షన్ ప్రకారం దేశ సార్వభౌమాధికారానికి, సమగ్రతకు నష్టం వాటిల్లితే ఎవరి మీదనైనా దేశద్రోహం కేసు పెట్టి అరెస్ట్ చేయవచ్చు అన్నారు. ఒకసారి దేశద్రోహం కేసు నమోదైతే దానికి శిక్ష మరణ దండనేనని ఆయన తెలిపారు. వరంగల్ ఆదర్శ లా కళాశాల అధ్యాపకుడు పి.తేజరెడ్డి కుటుంబ చట్టాల గురించి మాట్లాడుతూ.. మన పురాణాల నుంచి కుటుంబ చట్టాలు ఏర్పడ్డాయని.. ఏ మతానికి ఆ మతం చట్టాల రూపంలో తమ యొక్క పురాణాలను, సంస్కృతి సాంప్రదాయాలను ఫ్యామిలీ 'లా'లో ప్రవేశ పెట్టిందన్నారు. కార్యక్రమంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్(ఐఏఎల్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు, ఉపాధ్యక్షుడు కె.ఉమామహేశ్వరరావు, టి.అరుణ, కోశాధికారి శరత్‌బాబు, సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడమ్స్, సీనియర్ న్యాయవాదులు ఎస్.లక్ష్మణ్‌రావు, కె.వెంకటేశ్వరరావు, ఎం.అజయ్‌కుమార్, సిహెచ్ కృష్ణప్రసాద్, ఎస్‌కె బుజ్జిసాహెబ్, కె.విజయ్‌కుమార్, సీహెచ్ రామారావు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే..



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మధిర: రాజకీయంగా ఎదుర్కొనే ధైర్యం లేకనే భౌతిక దాడులకు పాల్పడతారని సీనియర్ నేత పుత్తుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, మాదాల రామారావు, మొండితోక సుధాకర్, చెరుకూరి నాగార్జున, న్యాయవాది చావాలి రామరాజు, ఎర్రగుంట రమేష్, కోమటిడీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం మధిరలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై దాడి కుట్ర పిరికి పంద చర్యఅని, వారిని పోలీసులు కఠినంగా శిక్షించాలని కోరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలో అత్యధిక మెజారిటీతో గెలిచి ముగ్గురు మహా నాయకులు మంత్రి పదవులు చేపట్టారని వారి నాయకత్వంలో జిల్లా సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని తెలిపారు. కానీ ఫోన్ ట్యాపింగులతో అత్యున్నత రాజకీయ నాయకుల విలువైన జీవితాలను తెలుసుకోవడం, వారిని అంతం చేయాలని కుట్రలు చేయటం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని వారు తెలియజేశారు. ప్రభుత్వం ఈ విషయంపై విచారణ జరిపి ఏ స్థాయి వ్యక్తులపైనైనా చర్య తీసుకోవాలని కోరారు.

సత్తుపల్లి: తుమ్మలపై దాడి కుట్రపై విచారణ జరపాలని ఖమ్మంజిల్లా మున్నూరుకాపు సంఘం ఉపాధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుబ్బారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాలు త్వరలో వెల్లడి కావాలని, విలువైన సిద్ధాంతాలకు నీతి నిజాయతీలకు తుమ్మల మారుపేరు అన్నారు. 40 సంవత్సరాల సుదీర్ఘ రాజకీయ చరిత్రలో అభివృద్ధి యజ్ఞం తప్ప మరొకటి కనిపించలేదన్నారు.

కల్లూరురూరల్: గత ప్రభుత్వ హయాంలో తుమ్మలపై జరిగిన కుట్రకోణాన్ని వెలికితీసి దోషులను శిక్షించాలని జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాకర్ల రంగారావు, సీనియర్ నాయకుడు జాస్తి శ్రీనివాసరావు తెలిపారు. శనివారం కల్లూరులో నిర్వహించిన టీడీపీ ముఖ్య నాయకుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. అనంతరం చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టిబాబు, గోపాలరావు, మరియాదాస్, శ్రీనివాసరావు, వెంకటరామయ్య, ఏడుకొండలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



ఎర్రుపాలెం: నర్సింహాపురంలో సీట్లు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం నాగేశ్వరరెడ్డి

ఎర్రుపాలెం/మధిర(చింతకాని): మండలంలోని నర్సింహాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న 11మంది విద్యార్థులు గురుకులాలు నిర్వహించిన 5వ తరగతి ఎంట్రన్స్‌లో ఉత్తమ ప్రతిభను కనబరిచి సీట్లు సాధించారు. శనివారం పాఠశాల హెచ్‌ఎం మద్దిరెడ్డి నాగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులను ఎంఈఓ వై.ప్రభాకర్‌రావు, ఎంపీటీసీ జయలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం సూరానేని హనుమంతరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ సీహెచ్ రంగారెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. అదే విధంగా చింతకాని మండలంలోని బస్వాపురం ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగోతరగతి విద్యార్థులు గురుకులాల్లో ప్రవేశం పొందగా హెచ్‌ఎం అభినందించి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సదర్భంగా హెచ్‌ఎంలు మాట్లాడుతూ.. గురుకులాల్లో సీట్లు సాధించిన విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని దీవించారు.

కారేపల్లిలో గంట పాటు నిలిచిన 'బెళగావి'

కారేపల్లి: ముందు స్టేషన్‌లో లూప్‌లైన్లు ఖాళీ లేక కారేపల్లి రైల్వేస్టేషన్‌లో గంట పాటు బెళగావి రైలు నిలిచిపోయింది. భద్రాచలంరోడ్డు (కొత్తగూడెం) నుంచి కర్ణాటక రాష్ట్రంలోని బెళగావి వరకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు కారేపల్లి స్టేషన్ మీదుగా శనివారం సాయంత్రం ఐదున్నర గంటలకు వెళ్లాల్సి ఉంది. కానీ గంట ఆలస్యం కావడం, ముందు పోచారం స్టేషన్‌లోని మూడు ట్రాక్‌లపై గూడ్స్ రైళ్లు ఉండటంతో వెళ్లే మార్గం లేక కారేపల్లిలో హాల్టింగ్ లేకున్నా గంట పాటు నిలిపివేశారు. దీంతో ఉక్కపోత, స్టేషన్‌లో తాగునీరు లేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. చిన్నారులు, వృద్ధులు, మహిళలు దప్పికతో ఇబ్బందులు పడుతున్నారంటూ పలువురు స్టేషన్ మాస్టర్‌ను నిలదీశారు.

ఆశాజనకంగా పెసర



కేసుపల్లిలో సాగు చేసిన పెసర

- మండలంలో 150 ఎకరాల్లో సాగు
- ఎకరానికి రూ.35 వేల ఆదాయం
- ఆసక్తి చూపుతున్న అన్నదాతలు

ఏన్కూరు: వాణిజ్య పంటలు సాగు చేసి అధిక పెట్టుబడులు పెట్టి వైరస్‌లు సోకి దిగుబడులు రాక అప్పుల పాలవుతున్న రైతులు ప్రత్యామ్నయ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఈ ఏడాది మండలంలో మిర్చికి వైరస్ సోకడంతో రైతులు నష్టపోయారు. మిర్చిని పీకి వేసి దాని స్థానంలో పెసర సాగు చేశారు. పెసరకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉండడంతో రైతులు ఈ సాగుపై మక్కువ చూపుతున్నారు. మార్కెట్లో క్వింటాకు రూ.7,500 నుంచి రూ.8,500 వరకు ఉండడంతో అన్నదాతలు ఈ సాగు చేపట్టారు.

మండలంలో సాగు వివరాలిలా..

మండల పరిధిలోని శ్రీరాంగిరి, కేసుపల్లి, బురదరాఘవాపురం, హిమామ్‌నగర్, నాచారం, జన్నారం, నూకలంపాడు గ్రామాల్లో సుమారు 150 ఎకరాల్లో రైతులు పెసర సాగు చేపట్టారు. ఎకరానికి సుమారు రూ.22 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. ఎకరానికి సుమారు 8 క్వింటాళ్లపైన పెసర దిగుబడులు వచ్చాయి. మార్కెట్లో రూ.8 వేలకు పైగా విక్రయించారు. దీంతో రైతులకు ఖర్చులు పోను ఎకరానికి రూ.35 వేలకు పైగా ఆదాయం రావడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– రైతులు జూన్‌లో పెసరసాగు వేస్తారు. అధిక వర్షాల వలన పంట దెబ్బతింటుంది. రైతులు గత కొన్ని సంవత్సరాలుగా పెసర సాగు చేయకపోవడంతో దిగుబడులు లేక ధర ఎక్కువైంది. దీంతో వచ్చే ఏడాది మండలంలో పెసర సాగు పెరగనుంది.

భూసారం పెరుగుతుంది..



రైతులు ఒకే పంట సాగు చేయడం వలన భూసారం దెబ్బతింటుంది. అపరాలు సాగు చేయడం వలన భూసారం పెరుగుతుంది. మండలంలో మిర్చిసాగు చేసి నష్టపోయిన రైతులు పెసర సాగు చేశారు. పెసరకు మార్కెట్లో డిమాండ్ ఉంది. రైతులు ప్రధానపంటలు కాకుండ అపరాలు సాగు చేపట్టాలి.

– బాలకృష్ణ, ఏఈఓ, బురదరాఘవాపురం

నాలుగు క్వింటాళ్ల దిగుబడి..



అరఎకరం పొలంలో పెసర సాగు చేశాను. సుమారు రూ.10 వేల వరకు పెట్టుబడులు అయ్యాయి. పంట మంచిగా పండింది. నాలుగు క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. రూ.8 వేలకు మార్కెట్‌లో విక్రయించాను. వచ్చే ఏడాది 2 ఎకరాల్లో పెసర సాగు చేస్తాను. ధర ఆశాజనకంగా ఉంది.

– భూక్య కిషన్, రైతు, హిమామ్‌నగర్